నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, మంగళవారం 30 ఏప్రిల్ 2024 | BHADRADRI KOTHAGUDEM




ఖమ్మం రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

## నామా గెలుపు తథ్యం

**బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా ముఖ్య నేతల సమీక్షలో పార్టీ అధినేత కేసీఆర్**



జిల్లా నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

ఖమ్మం, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపు తథ్యమని పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. ఖమ్మం సోమవారం రాత్రి నిర్వహించిన బస్సు యాత్ర, రోడ్ షో అనంతరం పార్టీ జిల్లా నేతలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలన్నీ నామా నాగేశ్వరరావుకు అనుకూలంగా వస్తున్నాయని అన్నారు. మిగతా పార్టీ అభ్యర్థుల కంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ముందంజలో ఉన్నట్లు చెప్పారు. పార్టీ నేతలు, కార్యకర్తలు మరింత కష్టపడి పని చేస్తే అత్యధిక మెజారిటీ తథ్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూడా బీఆర్‌ఎస్ సునామీ ఖాయమన్నారు. మొత్తం 12 సీట్లలో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



ఖమ్మం జడ్పీ సెంటర్‌లో రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు అడుగడుగునా నీరా'జనం'
- జన ప్రవాహంతో నిండిపోయిన జడ్పీ సెంటర్
- సంప్రదాయ నృత్యాలు, కోలాటాలు, బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం
- 'జై కేసీఆర్.. జైజై కేసీఆర్' అంటూ పిక్కటిల్లిన నినాదాలు
- కిలోమీటర్ల కొద్దీ జాతరలా కొనసాగిన బస్సు యాత్ర
- గులాబీ బాస్ ప్రసంగానికి ఈలలు, కేరింతలతో ప్రజల మద్దతు
- ఖమ్మంలో కేసీఆర్ రోడ్ షో సూపర్ సక్సెస్

# ఖమ్మం గుమ్మం
# గులాబీ వనం



మండుటెండను సైతం లెక్క చేయకుండా జనం ప్రవాహంలా దండుకట్టి తరలొచ్చింది. తమ ప్రియతమ నేతను కళ్లారా చూసేందుకు.. ఆయన ప్రసంగం వినేందుకు జాతరలా బయలుదేరింది. ఖమ్మం గుమ్మం గులాబీ వనమైంది. సోమవారం సాయంత్రం మహబూబాబాద్ జిల్లా మరిపెడ నుంచి ఖమ్మం జిల్లా శివారుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర చేరుకున్నదే తడవుగా గులాబీ దళం గుబాళింపుతో పులకించిపోయింది. సంప్రదాయ దుస్తులు ధరించి గిరిజన మహిళల నృత్యాలు.. మహిళలు బతుకమ్మలు, బోనాలతో కోలాటాలు వేస్తూ యాత్ర అగ్రభాగాన నడవగా.. మేళ తాళాల నడుమ.. పూలు చల్లుతూ.. మహిళలు హారతులు పడుతూ తమ అభిమాన నేత కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. 'జై కేసీఆర్.. జైజై కేసీఆర్', 'జై తెలంగాణ.. జైజై తెలంగాణ..' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా జనం నినదిస్తూ బస్సు యాత్రను అనుసరించారు. నగరంలోని కాల్వొడ్డు నుంచి జూబ్లీ క్లబ్, మయూరి సెంటర్ మీదుగా జడ్పీ సెంటర్ వరకు కిలోమీటర్ల కొద్దీ యాత్ర కొనసాగింది. ఇసుకేస్తే రాలనంత జనాన్ని ఉద్దేశించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగించారు. ప్రజలు ఈలలు, చప్పట్లతో అధినేత ప్రసంగానికి మద్దతు పలికారు. 'బీఆర్‌ఎస్‌కు బలమివ్వాలి.. ఎంపీగా నామాను గెలిపించాలి' అని పిలుపునిచ్చారు. అశేషంగా తరలివచ్చిన జన ప్రవాహంతో కేసీఆర్ రోడ్ షో సూపర్ సక్సెస్ అయ్యింది.

*- ఖమ్మం, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

## గోదావరిని ఎత్తుకుపోయేందుకు బీజేపీ కుటిలయత్నం

- ఇచ్చంపల్లి నుంచి నీళ్లు తీసుకెళ్తే 'సీతారామ' ఎడారే..
- జైళ్లకు భయపడేవాడా కేసీఆర్..?
- కాంగ్రెస్ పాలకులకు సోయిలేకనే నీటి కష్టాలు
- ఆయన భట్టి విక్రమార్క కాదు.. ఒట్టి విక్రమార్కనే..
- ఖమ్మం రోడ్ షోలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

ఖమ్మం, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం జిల్లా రైతుల వరప్రదాయిని సీతారామ ప్రాజెక్టుకు ఆయువుపట్టుగా ఉన్న గోదావరి నదిని కేంద్రంలోని బీజేపీ ప్రధాని నరేంద్ర మోదీ ఎత్తుకుపోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. ఈ విషయంపై రాష్ట్రానికి చెందిన బీజేపీ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కమాట కూడా మాట్లాడకుండా చోద్యం చూస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి దద్దమ్మలు మనకెందుకని ప్రశ్నించారు. 38 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టును ఎడారిని చేసే విధంగా ఇచ్చంపల్లి నుంచి గోదావరి నీటిని తమిళనాడుకు తీసుకెళ్లేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సోమవారం రాత్రి బస్సుయాత్ర ద్వారా ఖమ్మం వచ్చిన కేసీఆర్.. ఇక్కడి అంబేద్కర్ సెంటర్‌లో అశేష ప్రజావాహిని మధ్య ప్రసంగించారు. గతంలోనూ మోదీ ఇదే తరహా ప్రతిపాదన తెచ్చారని, తన తల తెగిపడినా ఒప్పుకోనని కరాఖండీగా చెప్పానని గుర్తుచేశారు. దేశంలో బీజేపీ పని అయిపోయిందని, 250 సీట్లు కూడా ఆ పార్టీకి రావని అన్నారు. తెలంగాణలో 12 స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలువబోతోందని స్పష్టం చేశారు. కేంద్రంలో రానున్నది సంకీర్ణ ప్రభుత్వమేనని, ఈ సమయంలో ఖమ్మంలో నామా నాగేశ్వరరావును గెలిపించుకుంటే కేంద్ర మంత్రి అవుతారని, జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ పాలనలో నిజమైన సంక్షేమం పేదలకు అందిందని గుర్తుచేశారు. అంతకుమించిన సంక్షేమం బీఆర్‌ఎస్ పాలనలోనే అందిందని జ్ఞప్తికి తెచ్చారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ హామీ తస్సుమన్నదని, రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామంటున్నారని అన్నారు. కానీ రైతులకు సైతం చెప్పులున్నాయనే విషయాన్ని కాంగ్రెస్ నేతలు విస్మరించారని అన్నారు. జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. కేవలం ఒట్టి విక్రమార్కేనని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వరికోతలుంటే, కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కోతలు దాపురించాయని దుయ్యబట్టారు. తెలంగాణ కోసం పోరు చేసిన కేసీఆర్‌ను భయపెట్టడం ఎవరితరమూ కాదని స్పష్టం చేశారు. 'జైళ్లకు తాను భయపడితే తెలంగాణ వచ్చేదా?' అంటూ ప్రజలను అడిగారు. కాంగ్రెస్ పాలకులకు సోయి లేకపోవడం వల్లనే తాగు, సాగునీటి కష్టాలు దాపురించాయని అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 495 అడుగుల నీళ్లున్నప్పుడే జిల్లా రైతాంగాన్ని కాపాడామని, మండు వేసవిలో పాలేరులో మత్తడి దుంకించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని అన్నారు. ఇప్పుడు సాగర్‌లో 510 అడుగుల నీళ్లున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ఇది ప్రభుత్వ వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర మాజీ మంత్రి అజయ్‌కుమార్ నాయకత్వంలో ఖమ్మం లకారం చెరువును బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ మంత్రి, పక్క జిల్లాలో నీటిపారుదలశాఖ మంత్రి ఉన్నా గుక్కెడు నీళ్లు కరువయ్యాయని ఆరోపించారు. ఖమ్మం, కొత్తగూడెంలో మెడికల్ కళాశాలలను మంజూరు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దేనన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల మెడలు వంచేందుకు, వారితో యుద్ధం చేసేందుకు ప్రజల మద్దతుతో బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉందన్నారు. బీజేపీకి ఓటు వేస్తే గోదావరిలో వేసినట్లేనని, కాంగ్రెస్‌కు ఓటేస్తే ఏమైందో ప్రజలు ఇప్పటికే చూశారని అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అద్భుత ఫలితాలు రానున్నాయన్నారు. ఖమ్మం లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, మదన్‌లాల్, హరిప్రియ, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, జననేత రోడ్‌షోకు అశేష ప్రజావాహిని హాజరుకావడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నెలకొంది.

## నేడు 'గూడే'నికి గులాబీ దళపతి

- కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద రోడ్ షో, ప్రసంగం
- హాజరుకానున్న బీఆర్‌ఎస్ నాయకులు, శ్రేణులు
- రాత్రికి పాల్వంచలో పార్టీ అధినేత బస

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రారంభించిన ప్రచారంలో భాగంగా ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం కొత్తగూడెం రానున్నారు. బస్సు యాత్ర ద్వారా వస్తున్న ఆయన.. మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన రోడ్ షోలో ప్రసంగిస్తారు. గులాబీ దళపతి బస్సు యాత్ర, రోడ్ షోల విజయవంతం కోసం బీఆర్‌ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్ని ఏర్పాట్లూ చేశారు. బస్సు యాత్ర ద్వారా వైరా, ఏన్కూరు, జూలూరుపాడు, సుజాతనగర్ మీదుగా కొత్తగూడెం చేరుకోనున్న కేసీఆర్.. కొత్తగూడెం పట్టణంలో రోడ్ షోలో పాల్గొంటారు. పోస్టాఫీస్ సెంటర్, రైల్వే స్టేషన్ సెంటర్ మీదుగా ఈ రోడ్ షో కొనసాగుతుంది. అదేరోజు రాత్రి పాల్వంచ పట్టణంలో బస చేయనున్నారు. కాగా, గులాబీ బాస్ రోడ్ షోలో పాల్గొనేందుకు, ఆయన ప్రసంగాన్ని ఆసాంతం వినేందుకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఈ బస్సు యాత్ర, రోడ్ షోలలో ఖమ్మం పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, మదన్‌లాల్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ తదితర ముఖ్య నేతలు పాల్గొననున్నారు.